క్లుప్తంగా

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు మేనల్లుడు అజయ్‌శ్రీ వివాహ రిసెప్షన్ ఆగిరిపల్లి పొన్నం కల్యాణ మండపంలో శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఆయన కుమారుడు మేకా వేణుగోపాల అప్పారావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నేడు పోలవరంలో ఎన్నికల ప్రచారం

చాట్రాయి: మండలంలోని పోలవరంలో వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం సాయంత్రం 5 గంటలకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావుకు నివాళి



విస్సన్నపేట: మండలంలోని కొండపర్వ గ్రామ మాజీ సర్పంచ్ పైడిపాల వెంకటేశ్వరరావు (చిట్టియ్య) 75 గురువారం మృతి చెందారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు శుక్రవారం మాజీ సర్పంచ్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, అనుమోలు శివబాజీ, ఎంపీటీసీ జి. మల్లయ్య పాల్గొన్నారు.

కలశాలతో బ్రహ్మం గారి మఠానికి భక్తుల యాత్ర



మైలవరం: మైలవరం వీరబ్రహ్మేంద్రస్వామి ధ్యాన మందిరం నుంచి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంకు భక్తులు 32 కలశాలతో శుక్రవారం యాత్రకు బయలు దేరారు. మహిళా భక్తులు 32 కలశాలు, గోవిందమ్మకు సారే సమర్పణ చేయడానికి కందిమల్లాయపల్లెలోని బ్రహ్మం గారి మఠానికి బయలుదేరారు. మైలవరం నుంచి 51 మంది బ్రహ్మం గారి భక్తులు యాత్రలో పాల్గొని కందిమల్లాయపల్లెకు చేరుకుని బ్రహ్మంగారిని సమాధి దర్శించుకుంటామని వారు తెలిపారు. స్వామివారిపై ఉన్న విశ్వాసంతో ప్రతి సంవత్సరం వెళుతున్నామని భక్తులు చెప్పారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

తిరువూరు: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఏప్రిల్ 27న జరిగే పాలిసెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని తిరువూరు శ్రీ వాహినీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ పవన్‌కుమార్ తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పిస్తామని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు సెల్: 99896 30677 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

చలివేంద్రం ప్రారంభం



వెల్వడం(మైలవరం): ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలని పూర్వ విద్యార్థి సంఘం నాయకులు, రెడ్‌క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ సెక్రటరీ, ట్రెజరర్ గూడూరు నాగిరెడ్డి తెలిపారు. వెల్వడం లకిరెడ్డి పాపులమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సహకారంతో గుడ్ ఫ్రైడే సందర్భంగా స్థానిక ప్రధాన కూడలిలో మంచి నీటి చలివేంద్రాన్ని ప్రవాసాంధ్రులు, పూర్వ విద్యార్థి అయిలూరి రాజారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గ్రామ పెద్దలు యరమల రామకోటిరెడ్డి, లకిరెడ్డి చిన్న పుల్లారెడ్డి, యరమల నరసింహారెడ్డి, గుర్రాల కోటేశ్వరరెడ్డి, శాగం జనార్ధనరెడ్డి, పి. గోపాల్ మాస్టారు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా

గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు): గ్రామంలో విద్యుత్ స్తంభాలు కొత్తవి వేస్తున్న కారణంగా తాగునీటి పైపులైన్లు మరమ్మతులకు గురయ్యాయి. గ్రామస్తులకు తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా పంచాయతీ అధికారులు శుక్రవారం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. సర్పంచి నక్కా కమల, నాయకులు సుధాకర్, బారు అచ్యుతరావు తాగునీటి సరఫరాను పర్యవేక్షించారు.

మానవాళి రక్షణకు క్రీస్తు బలియాగం

- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే
- చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు
- పలు ప్రాంతాల్లో సిలువ మార్గం



నూజివీడు సీఎస్‌ఐ టౌన్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

మైలవరం: సర్వ మానవాళి రక్షణ కోసం మహా పరిశుద్ధుడైన ఏసుక్రీస్తు ఎటువంటి తప్పు చేయకుండానే నిందారోపణలతో సిలువ మరణం పొందారని పలువురు పాస్టర్లు పేర్కొన్నారు. మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లో గుడ్ ఫ్రైడేను శుక్రవారం ఘనంగా జరిగాయి. చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సిలువపై ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలను ధ్యానించారు. పలు ప్రాంతాల్లో విశ్వాసులు సిలువను మోస్తూ సిలువమార్గం కార్యక్రమాన్ని నిర్వహించారు. మైలవరంలో ఆర్‌సీఎం విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ కె. అనిల్ ఫ్రాన్సిస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుడ్ ఫ్రైడేని పురస్కరించుకుని మైలవరం విచారణ పరిధిలోని 16 సంఘాల విశ్వాసులు వందలాది మందితో కూడి 20 అడుగుల సిలువను మోస్తూ స్థానిక వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఏసుక్రీస్తు 2024 సంవత్సరాల కిందట కపాలకొండ మీద భారమైన సిలువ మ్రానును మోసిన విధానాన్ని, 14 స్థలాల ఘట్టాలను ధ్యానిస్తూ, సిలువ పాటలను విశ్వాసులు ఆలపిస్తూ ముందుకు సాగారు. సిలువపై క్రీస్తు పలికిన ఏడు మాటలను ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్ వివరించారు. సిలువ మరణం ద్వారా సర్వ మానవాళికి క్షమాపణ, త్యాగం, శత్రువులను ప్రేమించడం, ద్వేషాన్ని వీడి సేవ చేయడం, పుణ్యమార్గంలో జీవించడం ఏసుక్రీస్తు నేర్పించారని చెప్పారు. కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ సిస్టర్స్, ఉప దేశకులు, విన్సెంట్ పాల్ సభ్యులు, మరియ దళ సభ్యులు, మదర్ థెరిస్సా యూత్ సభ్యులు, దీక్షాపరులు, 16 సంఘాల విశ్వాసులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

తిరువూరులో సిలువ మార్గం..

తిరువూరు: స్థానిక ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా సిలువ మార్గం నిర్వహించారు. మధిర రోడ్డులోని చర్చి నుంచి ప్రధాన వీధుల మీదుగా జరిగిన సిలువ మార్గంలో క్రైస్తవ విశ్వాసులు, ఆర్‌సీఎం సంఘస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. క్రీస్తు గీతాలు ఆలపిస్తూ, ఏసుక్రీస్తు తదితర వేషధారణలో భక్తులు పాల్గొన్నారు. ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పాస్టర్ రెవరెండ్ విజయకుమార్ గుడ్ ఫ్రైడే ఆవశ్యకతను వివరించారు. మానవాళి చేసిన పాప క్షమాపణ కోసం ఏసుక్రీస్తు సిలువ వేయబడ్డారని, శాంతి, సహనం, కరుణ ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఏసుక్రీస్తు బోధించారన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

రెడ్డిగూడెం: మండలంలోని వెలగలగూడెం ఆర్‌సీఎం చర్చి, రెడ్డిగూడెం సీఎస్‌ఐ చర్చిలతోపాటు పలు ఆలయాల్లో గుడ్ ఫ్రై డేను జరుపుకున్నారు. వెలగలగూడెం ఆర్‌సీఎం విచారణ దేవాలయం రెవరెండ్ ఫాదర్ టి. దానియేలు మాట్లాడుతూ సిలువపై క్రీస్తు పలికిన ఏడు మాటలను వివరించారు. ఈ సందర్భంగా వెలగలగూడెం, రెడ్డిగూడెంతోపాటు పలు గ్రామాల్లో క్రైస్తవులు సిలువను మోస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. ఆయా గ్రామాలలోని చర్చిలలోని పాస్టర్స్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం ఆర్‌సీఎం చర్చిలో అన్నదానం చేశారు. పాస్టర్లు బాలస్వామి, జేమ్స్, ఏసుపాదం, వివిధ గ్రామాల క్రైస్తవులు పాల్గొన్నారు. వివరించారు. క్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలు క్రైస్తవ మార్గంలో నడుస్తున్న వారికి ఎన్నో ఆధ్యాత్మిక భావాలు కలిగిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ సత్యమార్గాన్ని అనుసరించాలని కోరారు. 65వ నంబర్ జాతీయ రహదారిపై క్రీస్తు సిలువ మార్గం నిర్వహించారు. ఆనాటి రోజుల్లో ఏసుక్రీస్తు సిలువపై పడిన కష్టాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. డాన్‌బాస్కో, సెయింట్ ఆన్స్ సిస్టర్లు, మరియదళ సభ్యులు భక్తిగీతాలు ఆలపించారు.

గుడ్ ఫ్రైడే ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నూజివీడు: నూజివీడు పట్టణంలోని సీఎస్‌ఐ టౌన్ చర్చిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు. ఫాదర్ సంతోష్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ మానవాళి కోసం ఏసుక్రీస్తు చేసిన త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే అని వివరించారు. ఏసుక్రీస్తు చూపిన మార్గాన్ని అనుసరించాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, సీనియర్ న్యాయవాది కేజే డిక్సన్, ఏఎంసీ డైరెక్టర్ మద్దాల రూత్‌మేర్సీ, కౌన్సిలర్ కొప్పుల ప్రదీప్, నాయకులు కల్లేపల్లి ఆదినారాయణ, హరికోటి ప్రసాద్, కాలి సుగుణరావు తదితరులు పాల్గొన్నారు.

- విజయవాడరూరల్: పైడూరుపాడు గ్రామంలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఆగస్టిన్ వేళాంకిని ఆధ్వర్యంలో పరిశుద్ధ సిలువ మార్గం జరిగింది. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు కృప ఎల్లావేళలా గ్రామప్రజలపై ఉండాలని ప్రార్థనలు చేశారు. సంఘస్తులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు. రాయనపాడు గ్రామం అశోక్ నగర్, శాంతినగర్‌లో ఆర్‌సీఎం చర్చిల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఫాదర్ బాలస్వామి గుడ్ ఫ్రైడే గురించి వివరించారు. కొత్తూరు, తాడేపల్లి గ్రామాల్లో సీఎస్‌ఐ, ఆర్‌సీఎం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో సిలువ మార్గం నిర్వహించారు.
- ఇబ్రహీంపట్నం: గుడ్‌ఫ్రైడేను మండలంలో వివిధ గ్రామాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవులు క్రీస్తు మరణాన్ని స్మరిస్తూ 40 రోజుల పాటు చేపట్టిన దీక్షలు ముగిశాయి. ఇబ్రహీంపట్నం, కొండపల్లి, గుంటుపల్లి తదితర గ్రామాల్లోని ఆర్సీఎం చర్చి ఫాదర్లు అనిల్ కుమార్, తులిమిల్లి ఆంథోని భక్తులకు దైవసందేశం ఇచ్చారు. మానవాళి మనుగడకు ఏసుక్రీస్తు చేసిన త్యాగాలను
- విస్సన్నపేట: గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో క్రైస్తవులు సిలువమార్గం నిర్వహించారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిల ఆధ్వర్యంలో నూజివీడు రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి నుంచి పుట్రేల రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి వరకు సిలువను మోస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘస్తులు, ఆయా చర్చిల ఫాదర్లు పాల్గొన్నారు.
- జి.కొండూరు: మండల పరిధిలోని అన్ని చర్చిలలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. జి.కొండూరు సీఎస్‌ఐ చర్చిలో సంఘ కాపరి జి. ప్రభుదాసు ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు సిలువపై పలికిన ఏడుమాటలను భక్తులకు సంఘ కాపరి ప్రభుదాసు వివరించారు. కార్యక్రమంలో క్రైస్తవ భక్తులు పాలొన్నారు.
- నూజివీడు: పట్టణంలో క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నెహ్రూపేటలోని ఆర్‌సీఎం చర్చి విచారణ గురువులు రెవ. ఫాదర్ గొర్రుముచ్చు జోసఫ్ ఆధ్వర్యంలో వీధుల్లో క్రీస్తు సిలువ యాత్ర జరిగింది. ఈ సందర్భంగా విచారణ గురువులు మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి సందేశం ఇస్తూ క్రీస్తు సిలువపై బలియాగం చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, దయతో జీవించాలని సూచించారు. యాత్ర అనంతరం దివ్య బలిపూజ నిర్వహించారు. నూజివీడు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రీస్తు సిలువ ఆరాధన కార్యక్రమాలు జరిగాయి.

ఆగిరిపల్లి మండలంలో..

ఆగిరిపల్లి: మానవాళి పాప పరిహారార్థం క్రీస్తు సిలువ మరణం పొందారని పాస్టర్ నిరీక్షణ కుమార్ అన్నారు. మండలంలో గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆగిరిపల్లిలో బెత్లెహేం చర్చిలో పాస్టర్ నిరీక్షణ కుమార్, కనసానపల్లి, అడవినెక్కలం సీఎస్‌ఐ చర్చిలో పాస్టర్ శశిధర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాజవరం ఆర్‌సీఎం చర్చి నుంచి ఆగిరిపల్లి వరకు పాస్టర్ అల్లం ప్రతాపరెడ్డి, సతీష్ ఆధ్వర్యంలో సిలువ మార్గం నిర్వహించారు.

చాట్రాయి మండలంలో..

చాట్రాయి: మానవాళి పాప పరిహారం కోసం ఏసు క్రీస్తు సిలువపై మరణించిన రోజుని స్మరిస్తూ నిర్వహించే గుడ్ ఫ్రైడేను శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చనుబండ, చాట్రాయి, కోటపాడు ఆర్‌సీఎం చర్చి ఫాదర్లు సిలువను భుజాన వేసుకుని పాటలు పాడుతూ, ప్రార్థనలు చేసుకుంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సీఎస్ఐ, పెంతుకోస్తు, క్రీస్తు సంఘం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

- తిరువూరురూరల్: మండలంలోని మల్లేలలో శుక్రవారం చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. సీఎస్ఐ చర్చి గురువు రెవరెండ్ స్వరూపరాణి ప్రసంగించారు. గ్రామంలో సిలువ మార్గం నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి సభ్యులు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు. మండలంలోని చిట్టేల, చింతలపాడు, రోలుపడి, గానుగపాడు, ఎర్రమాడు, మునుకుళ్ల, కోకిలంపాడు గ్రామాల్లో స్థానిక క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు.
- గంపలగూడెం: గుడ్ ఫ్రైడేను మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తోటమూల ఆర్‌సీఎం చర్చి, పెనుగొలను, ఊటుకూరు గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు, సిలువ మార్గం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
- ముసునూరు: ముసునూరు, రమణక్కపేట, కాట్రేనిపాడుల్లో ఫాదర్లు జోసఫ్ తంబి, జాన్‌భారతి, గాంధీరాజు, రాజశేఖర్, ఇమ్మానుయేలు ఆధ్వర్యంలో ది లాస్ట్ సప్పర్ (ప్రభు కడ రాత్రి భోజనం) కార్యక్రమాన్ని ఆచరించారు. ఏసుక్రీస్తు తన శిష్యుల పాదాలు కడిగిన అంశాన్ని గుర్తు చేసుకున్నారు. చింతలవల్లి, వేల్పుచర్ల, యల్లాపురం, కాట్రేనిపాడు, లోపూడి, వలసపల్లి, చెక్కపల్లి ఆర్‌సీఎం చర్చిల ఆధ్వర్యంలో సిలువ మార్గం నిర్వహించారు.



తిరువూరులో సిలువమార్గం



వెలగలగూడెంలో సిలువను మోస్తున్న ఫాదర్ టి. దానియేలు



జి.కొండూరు సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న సంఘ కాపరి ప్రభుదాసు, భక్తులు



విస్సన్నపేటలో సిలువ మార్గం నిర్వహిస్తున్న క్రైస్తవులు



పెనుగొలనులో సిలువమార్గం ప్రదర్శన

మండలంలోని అన్ని క్రైస్తవ దేవాలయాలలో ఫాదర్లు, పాస్టర్లు, సంఘ కాపరుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. చింతలవల్లిలో సంఘ ఉపదేశి దేవరపల్లి బెనర్జీ, దేవకుమార్, స్వామిదాసు ఆధ్వర్యంలో క్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను ధ్యానించారు.



ముసునూరులో సిలువ మోస్తున్న ఫాదర్ జోసఫ్ తంబి





మైలవరం ఆర్‌సీఎం చర్చి నుంచి సిలువ ర్యాలీ ప్రారంభించిన ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్; నూజివీడులో క్రీస్తు సిలువ మార్గం నిర్వహిస్తున్న క్రైస్తవులు,



ఆగిరిపల్లిలో సిలువ మార్గం నిర్వహించిన క్రైస్తవులు

జీసస్ జీవితం మానవాళికి మహా సందేశం

సర్నాల తిరుపతిరావు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఏసు క్రీస్తు జీవితం మానవాళికి మహా సందేశం అని మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా కొండపల్లిలోని పెంతికోస్తు చర్చి, జీసస్ గ్రేస్ టెంపుల్, ఆర్సీఎం కాలనీ చర్చి, హౌస్ ఆఫ్ ప్రేయర్, తెలుగు బాప్టిస్టు చర్చి, షాలేమ్, థామస్ చర్చిల్లో శుక్రవారం జరిగిన ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. పలువురు పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వాదం అందజేశారు. ఏసుక్రీస్తు చల్లని కరుణాకటాక్షం ఎల్లవేళలా మీపై ఉండాలని ప్రార్థించారు. తిరుపతిరావు మాట్లాడుతూ కరుణామయుడు మహాత్యాగమే గుడ్‌ఫ్రైడే అని వివరించారు. నిస్సహాయులపై కరుణ, శత్రువులపై క్షమాగుణం మానవాళికి ఇచ్చిన సందేశమని చెప్పారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, వివిధ విభాగాల నాయకులు మిక్కిలి శరభయ్య, జోగి రాము, మేడపాటి నాగిరెడ్డి, గుంజా శ్రీనివాస్, పోరంకి శ్రీనివాస్‌రాజు, ఐవోసీ ఆనంద్, బుర్రి ప్రతాప్, ఆయా చర్చిల పాస్టర్లు, వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న తిరుపతిరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

దుర్గమ్మ భక్తులకు మజ్జిగ పంపిణీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ఈవో రామారావు ప్రారంభించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం ఎదుట దేవస్థాన ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం భక్తులకు మజ్జిగ పంపిణీ జరుగుతుంది. తొలి రోజైన శుక్రవారం ఆలయ ఈవో రామరావు కుటుంబం పేరిట 5 క్యాన్‌ల మజ్జిగను భక్తులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఈవో రామరావు మాట్లాడుతూ ప్రతి ఏటా ఉగాది పర్వదినం నుంచి ఆలయ ప్రాంగణంలో మజ్జిగ వితరణ చేస్తామని, అయితే ఈ ఏడాది ముందుగానే ఎండల తీవ్రత అధికం కావడంతో మజ్జిగ పంపిణీ ప్రారంభించామని చెప్పారు. అమ్మవారి దర్శనం పూర్తి చేసుకుని బయటకు వచ్చే వారికి మజ్జిగను అందిస్తున్నామని తెలిపారు.



బోనమెత్తిన భక్తజనం



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం భక్తుల బోనాలతో ఘనంగా ముగిసింది. భక్తులు స్థానిక మునేరులో స్నానాలు చేసి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. తొలి బోనం ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు అమ్మవారికి సమర్పించారు. భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలతోపాటు క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఉత్సవాల్లో ఐదు రోజుల పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నందిగామ ఏసీపీ రవికిరణ్ ఆధ్వర్యంలో సీఐ జానకిరామ్ పర్యవేక్షణలో ఎస్ఐ పి. రాంబాబు బందోబస్తు నిర్వహించారు. తిరునాళ్లలో తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దేవస్థాన అధికారులు, గ్రామంలో సర్పంచి వేల్పుల పద్మకుమారి పర్యవేక్షణలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టి భక్తులకు ఇబ్బంది లేకుండా చూశారు.

పార్కింగ్ కోసం స్థలాల పరిశీలన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దర్శనానికి విచ్చేసే భక్తుల వాహనాలను నిలుపుకునేందుకు సరైన స్థలం కోసం పరిశీలన చేస్తున్నారు. దుర్గగుడి ఈవో కెఎస్.రామరావు శుక్రవారం దుర్గాఘాట్, హెడ్ వాటర్ వర్క్స్ మధ్య ఉన్న స్థలంతో పాటు కుమ్మరిపాలెం సెంటర్‌లోని తిరుమల తిరుపతికి చెందిన స్థలాన్ని పరిశీలించారు. దుర్గాఘాట్ సమీపంలో ఉన్న స్థలాన్ని ఇప్పటికే దేవస్థానం వినియోగిస్తున్నందున అక్కడ నిల్వ చేసిన గ్రావెల్‌ను తరలించి వాహనాలను నిలిపేందుకు అనువుగా తీర్చిదిద్దే ఆలోచన చేస్తున్నారు. కనకదుర్గనగర్ నుంచి మహా మండపం వరకు అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో పాటు దుర్గాఘాట్‌లో అధిక సంఖ్యలో వాహనాలు నిలుపుకునే అవకాశం లేకపోవడంతో పార్కింగ్ స్థలాలను పరిశీలిస్తున్నట్లు ఈవో రామరావు పేర్కొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశామని అయాన్ ఐ హాస్పిటల్ గౌరవ అధ్యక్షుడు వావిలాల రజనీకాంతశర్మ తెలిపారు. కేదారేశ్వరపేటలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. వాసవి క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఫ్యూచర్‌పాత్ స్కూల్ అవరణలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే శిబిరంలో అయాన్ ఐ హాస్పటల్ నేత్ర వైద్యులు, సిబ్బంది పాల్గొని ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, ఐ డ్రాప్‌లను అందిస్తారన్నారు. పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పండ్ల మార్కెట్ వ్యాపారులు, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగులకు సహకారం అభినందనీయం



ఆగిరిపల్లి: దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి దాతల సహకారం అవసరమని డీఎస్పీ లక్ష్మయ్య అన్నారు. మండలంలోని తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో 50 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను డీఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో హీల్ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, క్యాంపస్ చైర్మన్ ధన ప్రకాష్, కార్యదర్శి తాతని లక్ష్మీ, ప్రిన్సిపాల్ సాయిబాబు పాల్గొన్నారు.

గాయనీ, గాయకులు నిరంతరం సాధన చేయాలి

విజయవాడ కల్చరల్: గాయనీ, గాయకులు నిరంతరం సాధన చేయాలని సీనియర్ పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు అన్నారు. స్వరార్చన ఆర్కెస్ట్రా 10వ వార్షికోత్సవం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ గాయనీ, గాయకులు అనుకరణ కన్నా సొంతబాణీ కలిగి ఉండాలన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి శ్రామిక నగర్‌లో మైనర్‌కు వివాహం చేసే యత్నాలను ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు శుక్రవారం అడ్డుకున్నారు. స్థానికంగా ఉండే బత్తుల సాంబయ్య కుమార్తె (16) గత ఏడాది పదో తరగతి చదివి ఇంటి వద్ద ఉంటోంది. బాలికకు వివాహం చేసేందుకు తల్లిదండ్రులు నిశ్చితార్థం కుదుర్చుకున్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి విషయాన్ని మైలవరం సీడీపీఓకు చేరవేశారు. ఆమె ఆదేశాల మేరకు పోలీసులను ఆశ్రయించారు. వారి సహకారంతో వివాహాన్ని అడ్డుకున్నారు. బాలికను విజయవాడ బాలికా సంరక్షణ కేంద్రానికి తరలించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడ పశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ అయ్యప్ప స్వామి దేవాలయం ఫీడర్‌తోపాటు వెంకయ్య స్వామి టెంపుల్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దత్త కల్యాణ మండపం ఏరియా, అయ్యప్ప స్వామి దేవాలయం ఏరియా, వన్ సెంటర్ ఏరియా, పంచాయతీ ఆఫీస్ ఏరియా, వేణుగోపాల స్వామి టెంపుల్ ఏరియా, గంగానమ్మ గుడి రోడ్డు, దేవినేనివారి వీధి, మరనాత చర్చి ఏరియా, అభినందన అపార్ట్‌మెంట్, కృష్ణ–గోదావరి–కావేరి అపార్ట్‌మెంట్ ఏరియా, వాసవి ఫార్మా మార్కెట్ ఏరియా, మురళి ఐస్ ప్లాంట్ ఏరియా వరకు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.